'కొత్తగూడెం సొసైటీకి సొంత భవనాన్ని కేటాయించండి'

మంత్రి తుమ్మలతో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ వీరహన్మంతరావు

చుంచుపల్లి, ఫిబ్రవరి 22: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండె వీరహన్మంతరావు గురువారం సుజాతనగర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం సుజాతనగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం మండలాల్లో విస్తరించి ఉన్న తమ సొసైటీకి సొంత భవనం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సౌలభ్యం కోసం జిల్లా కేంద్రంలోని రైటర్‌బస్తీ, బాబూ క్యాంపు, రైతుమార్కెట్ పరిధిలోని సింగరేణి పాత భవనాలలో ఏదైనా ఒక భవనాన్నిగానీ, సొంత భవనాన్ని కేటాయించాలని కోరారు. దీనికి మంత్రి స్పందించి వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేశారు. సొసైటీ భవనానికి స్థలం కేటాయించాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే వెంకట్రావుకు సన్మానం

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

భద్రాచలం, ఫిబ్రవరి 22: భద్రాచలంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు గురువారం పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరికెళ్ల తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు రత్నం రమాకాంత్, జాయింట్ సెక్రటరీ బొంబోతుల రాజీవ్, నాయకులు గాడి విజయ్, ఆకుల వెంకట్, మాచినేని భాను, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉత్తమ జాబితాలోకి ఐదు ఆరోగ్య ఉప కేంద్రాలు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 22: జిల్లాలోని ఐదు ఆరోగ్య ఉప కేంద్రాలు జాతీయ మార్గదర్శకాల ప్రకారం తగిన ప్రమాణాలను పాటిస్తున్నాయని కేంద్ర బృందం వెల్లడించింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యతా ప్రమాణాల పరిశీలనలో భాగంగా నేషనల్ క్వాలిటీ అండ్ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) ప్రోగ్రామ్‌కు చెందిన జాతీయ బృంద సభ్యులు గత నెలలో జిల్లాలో పర్యటించారు. పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించి అక్కడ అందిస్తున్న సేవలను తనిఖీ చేశారు. ఆ నివేదికలను జాతీయ అధికారులకు సమర్పించారు. ఆ నివేదికల ఫలితాల జాబితాను కేంద్ర అధికారులు ఇటీవల వెల్లడించారు. ఆ జాబితాలో జిల్లాలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం (మోరంపల్లి బంజర పీహెచ్‌సీ), సీతారాంపురం (రేగళ్ల పీహెచ్‌సీ), చాతకొండ-1 (రేగళ్ల పీహెచ్‌సీ), సింగభూపాలెం (సుజాతనగర్ పీహెచ్‌సీ), పాత అంజనాపురం (సుజాతనగర్ పీహెచ్‌సీ) స్థానం పొందాయి. ఇవన్నీ జాతీయ మార్గదర్శకాల ప్రకారం ప్రజలకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన వైద్య సేవలు అందిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

28న జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 22: మండలంలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 28న జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ఉంటుందని జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు తెలిపారు. పాఠశాలలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ... జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా దీనిని జిల్లా విద్యాశాఖ, తొలి అడుగు ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తాయన్నారు. ఆరోగ్యం, జీవన శైలి, పర్యావరణం, వ్యవసాయం అంశాలపై ఎగ్జిబిషన్స్‌ను మాత్రమే అనుమతిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 6, 9 తరగతుల విద్యార్థులు పాల్గొన్నవచ్చని చెప్పారు. ఈ నెల 27 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 92472 96012 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు. ఎంఈవో సత్యనారాయణ, హెచ్ఎం ఆనంద్ పాల్గొన్నారు.

రామయ్యకు పట్టాభిషేకం

రామయ్యకు పట్టాభిషేకం చేస్తున్న అర్చకులు

భద్రాచలం, ఫిబ్రవరి 22: పుష్యమి నక్షత్రం గురువారం అర్చకులు భక్తరామదాసు చేయించిన ఆభరణాలతోపాటు రాజదండం, రాజ ఖడ్గం, రాజ ముద్రిక, కత్తి, డాలు, జీయర్ స్వామివారు సమర్పించిన మహా సామ్రాట్ కిరీటాన్ని రామయ్యకు అలంకరించి పట్టాభిషేకం చేశారు. అష్టోత్తర శత నామార్చన పట్టారు. సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు రజత సింహాసనంపై సీతాసమేతుడైన రామయ్యను ఉంచి పట్టాభిషిక్తుడిని చేశారు.

సహస్ర కలశాభిషేకానికి అంకురార్పణ

గోదావరి నుంచి తీర్థపు బిందెను తీసుకువస్తున్న అర్చకుడు

భద్రాచలం, ఫిబ్రవరి 22: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో అర్చకులు సహస్ర కలశాభిషేకానికి అంకురార్పణ చేశారు. తొలుత పవిత్ర గోదావరి నుంచి తీర్థపు బిందెను తీసుకొచ్చారు. యాగశాలలో విశ్వక్సేన ఆరాధన, అష్టదిక్పాలకుల ఆవాహన, అగ్ని ప్రతిష్ఠతోపాటు పుట్టమన్నుతో పూజలు చేశారు. కాగా శుక్రవారం సహస్ర కలశావాహన, శనివారం సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు. వేడుకల నేపథ్యంలో శుక్ర, శనివారం స్వామి వారి నిత్య కల్యాణాన్ని నిలిపివేస్తున్నామని ప్రకటించారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

దాతలకు రశీదు అందజేస్తున్న ఆలయ అధికారులు

భద్రాచలం, ఫిబ్రవరి 22: భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయ సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన పమిడిఘంటం వెంకటరమణమూర్తి, మధుస్విత దంపతులు గురువారం ఆలయానికి విచ్చేసి రూ.లక్ష విరాళమిచ్చారు. దాతలను ఆలయ అధికారులు సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

బోగస్ ఓట్లను తొలగించాలి

చర్ల, ఫిబ్రవరి 22: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఎల్వోలు బోగస్ ఓట్లను తొలగించాలని, పక్కాగా ఓటర్ జాబితా సిద్ధం చేయాలని తహసీల్దార్ మొగిలి శ్రీనివాస్ ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్వోలతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భరణిబాబు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

సంపూర్ణ వ్యక్తిత్వ వికాసాన్ని అలవర్చుకోవాలి

మణుగూరు: ర్యాలీని ప్రారంభిస్తున్న మణుగూరు ఏరియా జీఎం రామచందర్, కొత్తగూడెం సింగరేణి: బడెన్ పావెల్ విగ్రహం వద్ద జీఎం పర్సనల్, స్కౌట్స్ అండ్ గైడ్స్

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 22: విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం అలవర్చుకోవాలని సింగరేని జీఎం పర్సనల్ (వెల్ఫేర్, ఆర్‌సీ) కే.బసవయ్య ఆకాంక్షించారు. ఇందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం ఎంతో దోహదపడుతుందని అన్నారు. అలాగే, భావిభారత పౌరులను తీర్చిదిద్దే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమానికి సింగరేణి సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. స్కౌట్స్ ఉద్యమ స్థాపకుడు బడెన్ పావెల్ జయంతి సందర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్‌లో వరల్డ్ థింకింగ్ డేను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బడెన్ పావెల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కౌట్స్ ఉద్యమ స్థాపకుడు బడెన్

'వరల్డ్ థింకింగ్ డే'లో సింగరేణి జీఎం (పర్సనల్) బసవయ్య

పావెల్ జయంతి సందర్భంగా ఏటా ఫిబ్రవరి 22న వరల్డ్ థింకింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. అనంతరం చిల్డ్రన్స్ పార్కు నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు శాంతిర్యాలీ నిర్వహించారు. మహిళా కాలేజీ ప్రిన్సిపాల్ శారద, డీవైపీఎం సుశీల్‌కుమార్, యూనిట్ లీడర్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరేణి ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో..

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 22: ఇల్లెందులోని సింగరేణి ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో గురువారం స్కౌట్స్ అండ్ గైడ్స్ నిర్మాత బేడెన్ పావెల్ జయంతి వేడుక జరిగింది. సింగరేణి ఏరియా జీఎం జాన్ ఆనంద్, కరస్పాండెంట్ జివి.మోహన్‌రావు (డీజీఎం), ప్రధానోపాధ్యాయుడు తిప్పర్తి వెంకటేశ్వర్లు, స్కౌట్స్ మాస్టర్ సంగాల సుధాకర్, గైడ్ కెప్టెన్ మేరీ పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలలో..

మణుగూరుటౌన్, ఫిబ్రవరి22: సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా పీవీ కాలనీలోని సింగరేణి పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సింగరేణి డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వరల్డ్ థింకింగ్ డే నిర్వహించారు. తొలుత హాజరైన ఏరియా జీఎం దుర్గం రామచందర్ వరల్డ్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు రాబర్డ్ బాడెన్-పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం శాంతి ప్రగతి యాత్ర ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, డీజీఎం(పర్సనల్) ఎస్ రమేశ్, హెచ్ఎం స్వరూపారాణి, కెప్టెన్ బీ సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరు యువకుల మృతి

భద్రం (ఫైల్)

వాసం సాయి (ఫైల్)

టేకులపల్లి, ఫిబ్రవరి 22: వేగంగా దూసుకొచ్చిన లారీ.. రెండు నిండు ప్రాణాలను బలి గొంది. ఎస్సై సైదా రవూఫ్ తెలిపిన వివరాలు.. మండలంలోని ప్రెగళ్ళపాడు పంచాయతీ ముత్యాలంపాడు గ్రామానికి చెందిన మోకాళ్ళ భద్రం(27), వాసం సాయి(20) కలిసి బైక్‌పై గురువారం మధ్యాహ్నం ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం గ్రామంలో సమ్మక్క-సారలమ్మ జాతరకు వెళ్లారు. సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో రోళ్ళపాడు పంచాయతీ ఆరోమైలు క్రాస్ రోడ్డు సమీపాన వీరి బైక్‌ను, పాల్వంచ నుంచి ఇల్లెందు వైపు వేగంగా వస్తున్న బూడిద లారీ ఢీకొంది. మోకాళ్ళ భద్రం అక్కడిక్కకడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన వాసం సాయి, ఖమ్మం ఆస్పత్రికి తరలించే లోపే మృతిచెందాడు. వీరి ద్దరి మృతితో ముత్యాలంపాడు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జడ్పీ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్, సీఈవో

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): జిల్లా పరిషత్ నూతన కార్యాలయ భవన నిర్మాణం కోసం జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, సీఈవో ప్రసూనారాణి గురువారం స్థలాన్ని పరిశీంచారు. స్థానిక పోస్టాఫీస్ సెంటర్‌లో ఉన్న జిల్లా పరిషత్ స్థలాన్ని పరిశీలించారు. కార్యాలయ భవనం నిర్మాణం కోసం రూ.10 కోట్లు మంజూరు చేయాల్సిందిగా గతంలో ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించిన విషయం విదితమే. అయితే ఆ ప్రతిపాదనలకు అంచనాలు రూపొందించి పంపాల్సిందిగా సీఎంవో కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. ఈ మేరకు జడ్పీ చైర్మన్, సీఈవో కలిసి భవన నిర్మాణం కోసం గురువారం స్థలాన్ని పరిశీలించారు. పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, డీఈఈ సత్యనారాయణ, ఏఈ శివలాల్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ప్లాట్ల పంపిణీ కోసం సర్వే పనులు

ప్లాట్లుగా ఏర్పాటు చేయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సీతాలక్ష్మి

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 22: మున్సిపాలిటీ పరిధిలోని ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం కోసం పట్టణంలోని పాత కొత్తగూడెం ఏరియాలో ప్రభుత్వ భూమిని అధికారులు గుర్తించారు. అందులో 75 గజాలతో కూడిన 807 ప్లాట్లను లేఅవుట్‌గా తయారు చేశారు. ఈ ప్లాట్ల పట్టాలతో గతంలో అప్పటి శాసనసభ్యుడు, కలెక్టర్‌తోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో అప్పుడు అందజేసిన పట్టాల ప్రకారం లబ్ధిదారులకు ప్లాట్లు అందించాల్సి ఉంది. అయితే ఆ ప్లాట్లలో జరుగుతున్న తుది పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి గురువారం పరిశీలించారు. అయితే గతంలో పంపిణీ చేసిన పట్టాల ప్రకారం లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించాల్సిన అంశాన్ని ప్రస్తుత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దృష్టికి చైర్‌పర్సన్ తీసుకెళ్లారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించి ప్లాట్ల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టీపీవో, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

బూర్గంపహాడ్: మాట్లాడుతున్న తహసీల్దార్ ముజాహిద్, సారపాక: అవగాహన కల్పిస్తున్న లింక్‌వర్కర్స్ జరీనా

సారపాక, ఫిబ్రవరి 22: ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జే కేర్ లింక్ వర్కర్ బీ జరీనా అన్నారు. వైఆర్‌జే లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కార్యాలయం వద్ద ఎయిడ్స్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సదస్సులో జరీనా మాట్లాడుతూ హెచ్ఐవీ అనేది అంటువ్యాధి కాదని, సురక్షితం కాని లైంగిక సంబంధాలు, కలుషిత రక్తం మార్పిడి, సిరంజీ వల్ల సోకుతుందన్నారు. ఏఆర్‌టీ మందులు వాడుతున్న వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం పింఛన్ ఇస్తుందని, అనుమానం ఉంటే ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కిరణ్, ఏఎన్ఎం రోషమ్మ, జయసుధ, ఆశ కార్యకర్త రమణ, లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోరంపల్లి బంజర్ పీహెచ్‌సీలో..

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 22: మండలంలోని మోరంపల్లి బంజర్ పీహెచ్‌సీ వైద్యురాలు లక్ష్మీసాహితీ ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో పల్స్‌పోలియోపై అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి మాట్లాడుతూ మండలాన్ని మొత్తం నాలుగు రూట్లుగా విభజించి 44 బూత్‌లు ఏర్పాటుచేసి 2 ట్రాన్సిట్ పాయింట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఒక మొబైల్ టీం ఏర్పాటు చేసి 0-5 ఏళ్ల లోపు పిల్లలు 3,105 మంది, 11 వలస కూలీ ప్రాంతాలను గుర్తించి 22 మంది పిల్లలను గుర్తించడం జరిగిందని తెలిపారు. అన్నిశాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎంసీహెచ్ పీవో చైతన్య, వైద్యురాలు లక్ష్మీ సాహితీ, హెచ్ఈవో రవి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మట్టి పోయండంటే.. చెత్త పోశారు..

లక్ష్మీదేవిపల్లిలో పంచాయతీ అధికారుల నిర్వాకం

జాతీయ రహదారి పక్కన పడేసిన చెత్తాచెదారం

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 22: మట్టి పోసి గుంతలను నింపాలన్న పాపానికి.. ఏకంగా ఆ గుంతల్లో చెత్తను పోసి చేతులు దులుపుకున్నారు పంచాయతీ అధికారులు. వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీదేవిపల్లి మండలం ప్రశాంతినగర్ పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి వెంట డ్రైనేజీల కోసం తీసిన గుంతలు ఉన్నాయి. అవి లోతుగా ఉండడంతో పలువురు ప్రయాణికులు వాటిల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఆ గుంతలను పూడ్చాలని అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీ అధికారులు ఆ గుంతల్లో మట్టిని పోయకుండా పంచాయతీలో సేకరించిన చెత్తను తీసుకొచ్చి పోశారు. వందలాది మంది తిరిగే జాతీయ రహదారి పక్కన ఇలా చెత్త వేయడంతో మళ్లీ ఎవరైనా ప్రమాదాలకు గురై అందులోకి వెళ్తే మొత్తానికే కూరుకపోయే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు.

సింగరేణిలో 272 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 22: సింగరేణివ్యాప్తంగా తొలివిడతగా ఖాళీగా ఉన్న 272 పోస్టులను భర్తీ చేస్తామని సింగరేణి సీఎండీ బలరాం గురవారం రాత్రి ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీ (మైనింగ్) ఈ2 గ్రేడ్ - 139 పోస్టులు, మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఎఫ్ అండ్ ఏ), ఈ2 గ్రేడ్ - 22 పోస్టులు, మేనేజ్‌మెంట్ ట్రైనీ (పర్సనల్) ఈ2 గ్రేడ్ - 22 పోస్టులు, మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఐఈ) ఈ2 గ్రేడ్ - 10 పోస్టులు, జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్ ఈ1 గ్రేడ్ -10 పోస్టులు, మేనేజ్‌మెంట్ ట్రైనీ (హైడ్రో జియాలజిస్ట్) ఈ2 గ్రేడ్ - 2 పోస్టులు, మేనేజ్‌మెంట్ ట్రైనీ (సివిల్) ఈ2 గ్రేడ్ - 18 పోస్టులు, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ ఈ1 గ్రేడ్ - 3 పోస్టులు, జనరల్ డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ (జీడీఎంవోస్) ఈ3 గ్రేడ్ - 30 పోస్టులు, నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో సబ్ ఓవర్సీర్ ట్రైనీ (సివిల్) ఈఅండ్ఎస్ గ్రేడ్-సీలో 16 పోస్టులు భర్తీ చేస్తామన్నారు. మార్చి 1వ తేదీ నుంచి 18లోపు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మినీ మేడారం జాతరలో కాటన్ బ్యాగుల పంపిణీ

కాటన్ బ్యాగులను పంపిణీ చేస్తున్న సంస్థ బాధ్యులు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 22: సుజాతనగర్ మండలంలోని గరిబ్‌పేట పంచాయతీ పరిధిలో ఉన్న మినీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో ప్రపంచ పర్యావరణ సంస్థ రాష్ట్ర కార్యదర్శి ముత్యాల క్రాంతి, జిల్లా అధ్యక్షుడు బరిగెల భూపేశ్ కాటన్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్లు పర్యావరణానికి చేటు చేస్తున్నందున ప్లాస్టిక్ కవర్ల బదులుగా కాటన్ బ్యాగులు వినియోగించాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

జూలూరుపాడు, ఫిబ్రవరి 22: మండలంలోని పుల్లుడుతండాకు చెందిన బాదావత్ శాంతి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నడవలేని స్థితిలో ఇంటికే పరిమితమైంది. కాగా, జేపీఆర్ ట్రస్ట్ సహకారంతో సమకూర్చిన నిత్యావసర సరుకులను సీఐ ఇంద్రసేనారెడ్డి గురువారం ఆమె ఇంటి వద్ద అందజేశారు. ఇడుపుల రాజు, గార్లపాటి గణేశ్, మురళి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు రవాణాలో సరికొత్త రికార్డులు

ఏరియా జీఎం శాలెంరాజు

రామవరం, ఫిబ్రవరి 22: బొగ్గు రవాణాలో సింగరేణి కొత్తగూడెం ఏరియా సరికొత్త రికార్డులు నెలకొల్పుతూ వెళ్తోంది. ఈ నెల 21 నాటికి రైలుమార్గం ద్వారా 2,761 రేకుల ద్వారా బొగ్గును రవాణా చేశారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రైలు మార్గం ద్వారా 2,752 రేకుల ద్వారా బొగ్గును రవాణా చేస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా 39 రోజులు మిగిలి ఉండగానే ఆ రికార్డును అధిగమించి 2,761 రేకుల ద్వారా బొగ్గు రవాణా చేశారు. దీంతో గత రికార్డులన్నింటినీ అధిగమించి సరికొత్త రికార్డును నెలకొల్పినట్లయింది. ఈ ప్రక్రియలో ప్రధానంగా జేవీఆర్ సీహెచ్‌పీ నుంచి 2,246 రేకుల ద్వారా, ఆర్‌సీహెచ్‌పీ నుంచి 515 రేకుల ద్వారా కలిపి ఇప్పటి వరకు మొత్తం 2,761 రేకుల బొగ్గు రవాణా చేసిన రికార్డును నెలకొంది. అధికారులు, ఉద్యోగులు, కార్మికులు భాగస్వాములై ఈ స్థాయిలో బొగ్గు రవాణా రికార్డును సాధించడంలో పట్ల ఏరియా జీఎం శాలెంరాజు గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగమైన వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఆకట్టుకున్న డిజిటల్ మేళా

మాట్లాడుతున్న ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్

భద్రాచలం, ఫిబ్రవరి 22: భద్రాచలంలోని గిరిజన గురుకులంలో ప్రథమ్ ఇన్నోవేటెక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'డిజిటల్ మేళా' ఆహుతులను ఆకట్టుకున్నది. మేళాను ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్ లాంఛనంగా ప్రారంభించారు. భద్రాచలం, బూర్గంపాడు మండలాలకు చెందిన 20 పాఠశాలల నుంచి దాదాపు 100 మంది బాల బాలికలు ప్రదర్శనలిచ్చారు. కంప్యూటర్ బేసిక్స్ లెర్నింగ్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మెండెం దేవదాస్ పాల్గొన్నారు.

3న పల్స్ పోలియో

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 22: వచ్చే నెల 3న మండలంలో పల్స్ పోలియో ఉంటుందని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని ఎర్రగుంట ప్రభుత్వ వైద్యశాలలో గురువారం వైద్య సిబ్బందితో సమావేశంలో మాట్లాడారు. మండలంలో ఐదేండ్ల లోపు వయసున్న చిన్నారులు 2,489 మంది ఉన్నారని చెప్పారు.

ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 22: మండలంలోని భీమునిగూడెంలో ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

పంచాయతీల సందర్శన

టేకులపల్లి, ఫిబ్రవరి 22: మండలంలోని కుంటల్ల, బద్దుతండా, పెట్రాంచెలక, మొక్కంపాడు, ఎర్రయిగూడెం, బోడు, కొప్పురాయి, బర్లగూడెం పంచాయతీల్లో అభివృద్ధి పనులను, పారిశుద్ధ్య పనులను ఎంపీడీవో రవీంద్రరావు గురువారం పరిశీలించారు. ఎంపీవో గణేశ్‌గాంధీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 22: మండలంలోని మామిళ్ల వారిగూడెం గ్రామంలోగల మల్లేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీని గ్రామస్తులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా శింగలదేవి కనకదుర్గారావు, మొడియం సూర్యచంద్రరావు, చిందిరాల నాగేంద్రరావు, వీర్నాల శ్రీను, వీర్నాల ఉమామహేశ్వరావు, ఇష్టేని కనకం, ఎస్‌కె.షకీల్, తునికిపాటి గీతాశంకర్, కోడిగంటి శ్రీను ఎన్నికయ్యారు.

'ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలి'

అశ్వారావుపేట, ఫిబ్రవరి 22: ఆర్యవైశ్యులకు రాజకీయంగా ప్రాధాన్యమివ్వాలని ప్రధాన పార్టీలకు ఉమ్మడి ఖమ